క్లుప్తంగా

12న గ్రామ సభ

తిరువూరు: స్థానిక బస్టాండ్ సెంటర్లోని రామ లింగేశ్వరాలయ పునర్నిర్మాణ ప్రతిపాదనలపై ప్రజాభిప్రాయ సేకరణకు ఈ నెల 12న గ్రామ సభ నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ తిరుమలశెట్టి వేణు తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఆలయ ప్రాంగణంలో జరిగే సమావేశంలో ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, పట్టణ పౌరులు పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేయవచ్చన్నారు.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర శాఖ ప్రారంభం



ఇబ్రహీంపట్నం: భారత ప్రభుత్వ రంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 44వ శాఖను కొండపల్లి మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు గురువారం ప్రారంభించారు. ప్రజలకు ఉత్తమ బ్యాంకింగ్ సేవలు అందించాలని ఆయన సూచించారు. బ్యాంక్ జోనల్ మేనేజర్ జీఎస్‌డీ ప్రసాద్ మాట్లాడుతూ తమ బ్యాంక్ గత నాలుగేళ్లుగా అభివృద్ధి సాధిస్తోందన్నారు. పొదుపు ఖాతాలు, ప్రభుత్వ పథకాలు, వ్యవసాయం, వెహికల్, ఎడ్యుకేషనల్ రుణాలు వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయని వివరించారు. డెప్యూటీ జోనల్ మేనేజర్ రజనీ కుమార్, బ్రాంచి మేనేజర్ మోనికా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



మైలవరం: ఆడుదాం ఆంధ్రా రాష్ట్ర స్థాయి వాలీబాల్ మహిళా పోటీలకు మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు నలుగురు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ప్రిన్సిపాల్ డాక్టర్ రవి మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన విద్యార్థినులు శ్రీవల్లి, సీతాకుమారి, జాస్మిన్, సుమత్రలు స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులతో పాటు ఫిబ్రవరి 9 నుంచి విశాఖపట్నంలో జరిగే స్టేట్ మీట్ వాలీబాల్ మహిళా పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను, పీడీ మన్నే స్వామిని కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

26 నుంచి సిలువగట్టు తిరునాళ్ల



నూజివీడు: పట్టణంలోని సిలువగట్టు పుణ్యక్షేత్రం తిరునాళ్లను ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు నిర్వహిస్తామని పుణ్యక్షేత్రం రెక్టార్ రెవ. ఫాదర్ గొర్రుముచ్చు జోసఫ్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నూజివీడు టౌన్ విచారణ గురువు రెవ.ఫాదర్ లాం జయరాజు మాట్లాడుతూ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న సిలువగట్టు తిరునాళ్లకు క్రైస్తవులు పెద్దఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రెవ.ఫాదర్ పెయ్యల మరియదాసు, సిస్టర్ చిన్నమ్మ, మరియదళ సభ్యులు, మఠకన్యలు, ఉపదేశులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చాట్రాయి తహసీల్దార్ బాధ్యతల స్వీకారం



చాట్రాయి: చాట్రాయి తహసీల్దార్‌గా మహ్మద్ మసూద్ ఆలీ గురువారం బాధ్యతలు చేపట్టారు. రాజమండ్రి కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆయన ఇక్కడకు వచ్చారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అభినందనీయం



నూజివీడు: ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల అవసరాలను తీర్చేందుకు హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య ఎం.చంద్రశేఖర్ అన్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో కే3 బాలికల హాస్టల్‌లో దివ్యాంగ విద్యార్థినుల కోసం ఏర్పాటు చేసిన వాషింగ్ మెషీన్, ఫ్రూట్స్ స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ (బాలురు) వెంకటరావు, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ (బాలికలు) స్రవంతి, హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు బ్రహ్మస్వాములు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఇక సర్వ హక్కులు

- వేగంగా జగనన్న కాలనీ ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్లు
- ఉచిత రిజిస్ట్రేషన్లకు విశేష స్పందన
- హర్షం వ్యక్తం చేస్తున్న మహిళలు





జి.కొండూరు శివారులోని జగనన్న కాలనీ; జి.కొండూరు గ్రామ సచివాలయంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

జి.కొండూరు: పేదల సొంతింటి కలను వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం నెరవేర్చింది. నవరత్నాలు పథకంలో అత్యంత ప్రతిష్టాత్మకమైనది పేదలందరికీ ఇళ్లు. ఈ పథకం ద్వారా అర్హులైన పేదలకు సొంతింటి కల నెరవేరేలా స్థలాలను మంజూరు చేసి నిర్మాణానికి నిధులను సైతం మంజూరు చేయడంతోపాటు సామగ్రిని సబ్సిడీపై ప్రభుత్వం అందజేసింది. లబ్ధిదారులు ఉత్సాహంగా నిర్మాణాలు పూర్తి చేసుకున్నారు. కొన్ని చోట్ల నిర్మాణ దశలో ఉన్నాయి. వీటిపై లబ్ధిదారులకు పూర్తి హక్కులు కల్పించేలా ఇళ్ల స్థలాలకు ప్రభుత్వం ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేస్తోంది.

గతంలో రాష్ట్రాన్ని పాలించిన ఎందరో నాయకులకు సాధ్యం కాని ఇళ్ల స్థలాల పంపిణీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సాధ్యం చేసి చూపారు. ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేని చోట ప్రైవేట్ స్థలాలను అధిక ధరలకు సైతం కొనుగోలు చేసి పట్టాలను పంపిణీ చేశారు. ఇళ్ల స్థలాల పంపిణీతో పాటు పక్కా గృహాలను మంజూరు చేసి ఇప్పుడు దేశ చరిత్రలో మునపెన్నడూ లేని విధంగా ఉచితంగా రిజిస్ట్రేషన్లను సైతం ప్రభుత్వమే చేయిస్తుండడంతో మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మైలవరం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 77 గ్రామ సచివాలయాల పరిధిలో 17,759 మంది లబ్ధిదారులు ఉన్నారు.

సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు

ఇప్పటికే జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులకు వారి పరిధిలో ఉన్న గ్రామ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు చేయించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ అథారిటీగా పంచాయతీ కార్యదర్శులకు జాయింట్ రిజిస్ట్రార్ హోదాను ప్రభుత్వం కల్పించింది. ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభమైన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఈ నెల 18వ తేదీ వరకు కొనసాగుతోంది. ఇప్పటికే గ్రామ వలంటీర్లు, ప్రజా ప్రతినిధుల ద్వారా లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వంద శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

మైలవరం నియోజకవర్గంలో లబ్ధిదారుల వివరాలు

మండలం	గ్రామ సచివాలయాలు	లబ్ధి దారులు
జి.కొండూరు	16	2,077
మైలవరం	17	4,142
ఇబ్రహీంపట్నం	21	6,102
రెడ్డిగూడెం	12	1,376
విజయవాడ రూరల్	11	4,062

ఉచితంగా రిజిస్ట్రేషన్లు

ఇళ్ల స్థలాలకు ఉచిత రిజిస్ట్రేషన్లను ప్రభుత్వమే చేయించడం వల్లన ఆ స్థలంపై లబ్ధిదారులైన మహిళలకు సర్వ హక్కులు ఏర్పడతాయి. వారి కుటుంబ అవసరాలకు ఆ స్థలంపై రుణాలను పొందడానికి కానీ అత్యవసర పరిస్థితుల్లో స్థలాన్ని విక్రయించుకోవాలన్నా అధిక ధరను పొందే అవకాశం కలుగుతుంది.



రిజిస్ట్రేషన్ చేయించడం గొప్ప నిర్ణయం

ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడంతో పాటు రిజిస్ట్రేషన్లు చేయించి ఇవ్వడం గొప్ప నిర్ణయం. గతంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా స్థలాలు పంపిణీ చేయలేదు. ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం.

–సంకటి నాగమణి, కొండపల్లి మున్సిపాలిటీ



నిరుపేదల కల నెరవేర్చారు

జి.కొండూరులో ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి మూడున్నర దశాబ్దాలు దాటింది. ఎందరో నిరుపేదల కల ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారు. ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేయడం చరిత్రలో నిలిచిపోతుంది.

– వేమిరెడ్డి శ్రీలక్ష్మి, జి.కొండూరు



జీవితాంతం రుణపడి ఉంటాం

నేను ముప్పై సంవత్సరాలుగా జి.కొండూరు శివారులోని గొల్లవాని కుంటలో ఉంటున్నాను. ఎన్ని ప్రభుత్వాలు మారినా మా కష్టాలు తీరలేదు. రోడ్డు, కరెంటు, నీరు లేక నరకయాతన పడ్డాము. ముఖ్యమంత్రి జగనన్న ఇళ్ల స్థలం ఇచ్చి మా కష్టాలను తొలగించారు. జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

–బాణావత్ సుశీల, జి.కొండూరు

మహిళల ఆర్థిక ప్రగతికి ప్రభుత్వం కృషి

నల్లగట్ల స్వామిదాసు



వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కును అందజేస్తున్న నల్లగట్ల స్వామిదాసు

ఎ.కొండూరు: నిరుపేద మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. నాలుగో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. నమూనా చెక్కును డ్వాక్రా మహిళలకు స్వామిదాసు అందజేసి మాట్లాడారు. మండలంలో వరుసగా నాలుగోసారి డ్వాక్రా మహిళల రుణమాఫీ 1,094 గ్రూపులకు రూ. 10.27 కోట్లు మహిళల బ్యాంక్ ఖాతాల్లో జమ చేశామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక వ్యవస్థ బలోపేతం చేయటానికి ఈ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి నిరుపేదల జీవితాల్లో వెలుగు నింపుతోందని చెప్పారు. అవినీతికి తావు లేకుండా ప్రభుత్వ పథకాలకు సంబంధించిన నగదు బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేస్తున్నామన్నారు. ఈ ప్రాంతంలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల సమస్యలను పరిష్కరించి వారికి మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని, తాగునీటి సమస్య పరిష్కారానికి ఇప్పటికే పలు గ్రామాల్లో వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేశామని, ప్రతి గ్రామానికి ఎంపీ కేశినేని నాని నిధులతో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. గంపలగూడెం మండలం వినగడప కట్టలేరు బ్రిడ్జి నిర్మాణం చేపడతామని గతంలో తిరువూరులో జరిగిన సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ నిలబెట్టారని, బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేశామని, త్వరలో పనులు చేపడతామన్నారు. జగనన్నకు మహిళలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు నరెడ్ల వీరారెడ్డి, ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, జెడ్పీటీసీ భూక్యా గనియా, వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, ఏపీఎం సత్యం, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి, ఇన్‌చార్జి ఎంపీడీఓ పరమాత్మ, వైఎస్సార్ సీపీ నాయకులు కోటా పుల్లారావు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు టి. సురేష్, సర్పంచులు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ అధ్యక్షులు, వెలుగు సీసీలు, వీఓఏలు, డ్వాక్రా గ్రూపు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి జోగి రమేష్‌ను కలిసిన తిరుపతిరావు



మంత్రి జోగి రమేష్‌ను కలిసిన తిరుపతిరావు తదితరులు

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌ను వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. తిరుపతిరావును మంత్రి జోగి రమేష్ అభినందించారు. గ్రామాల్లో వ్యవహరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం దాములూరు, చిలుకూరు, కాచవరం, కొటికలపూడి, కేతనకొండ, మూలపాడు, జూపూడి, తుమ్మలపాలెం, గుంటుపల్లి గ్రామాల్లో తిరుపతిరావు పర్యటించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికి సత్కరించారు. తిరుపతిరావు మాట్లాడుతూ సామాజిక న్యాయానికి పెద్దపీట వేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మైలవరం నియోజకవర్గంలో నాలాంటి వ్యక్తికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి మైలవరం సీటును గెలిపించి జగనన్నకు కానుకగా ఇద్దామని చెప్పారు. కార్యక్రమాల్లో జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న, వైఎస్సార్ సీపీ నాయకులు జోగి రాము, మేడపాటి నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బొంత సాంబశివరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నియంత్రణకు చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న దేశిరెడ్డి రాఘవరెడ్డి

చాట్రాయి: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఏపీ కో- ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లంకా నిర్మల అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని, మండలంలోని సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పంటలకు క్రిమి సంహారక మందులను డ్రోన్ల సహాయంతో చేస్తే మనిషికి ప్రాణాపాయం ఉండదని వ్యవసాయాధికారి శివశంకర్ తెలిపారు. రైతులు గ్రూపులుగా ఏర్పడితే సబ్సిడీపై డ్రోన్లు అందజేస్తామన్నారు. జగనన్న లే అవుట్లలో విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు స్తంభాలు ఏర్పాటు చేస్తున్నామని ట్రాన్స్‌కో ఏఈ సంజయ్ సభకు వివరించారు. ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు అందజేస్తున్నామని, 13 వేల కార్డులకు గానూ 9 వేలు కార్డులు అందజేశామని పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మంగా కుమారి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి ధ్రువీకరణ పత్రం అందజేత



బాధితురాలికి ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్

ముసునూరు: అగ్ని ప్రమాదం బారిన పడి దివ్యాంగురాలైన యువతికి డిజేబుల్డ్ సర్టిఫికెట్, ఉచిత బస్‌పాస్‌ను నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అందజేశారు. మండలంలోని రమణక్కపేటకు చెందిన ఉండవల్లి యామిని అగ్ని ప్రమాదానికి గురై దివ్యాంగురాలైంది. దీంతో ఆమె జీవనానికి ఇబ్బంది కలిగింది. విషయాన్ని జెడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ వరికూటి ప్రతాప్ ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే బాధితురాలికి సదరం స్లాట్ బుక్ చేయించి, డిజేబుల్డ్ సర్టిఫికెట్ మంజూరు చేయించారు. దీంతో పాటు ఆర్టీసీ ఫ్రీ బస్‌పాస్ మంజూరు చేయించారు. పింఛన్‌కు అర్హత కూడా లభించడంతో ఆమె ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేసింది. గురువారం జరిగిన కార్యక్రమంలో ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే స్థానిక నేతలతో కలిసి బాధితురాలికి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండా దుర్గాభవాని, మాజీ ఉప సర్పంచ్ సీహెచ్ కాంతారావు, వార్డు సభ్యుడు రాజు, పార్టీ నేతలు రవిప్రకాష్, సంతోష్, వెంకట్రావు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆగిరిపల్లి మండల పరిషత్ సమావేశం

ఆగిరిపల్లి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ గోళ్ల అనూష అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ శామ్యూల్ తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

ఈవీఎంల స్ట్రాంగ్‌రూమ్ ఏర్పాటుకు పరిశీలన



స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటుకు పరిశీలిస్తున్న ఆర్డీఓ వై.భవానీ శంకరి, డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్

నూజివీడు: రానున్న ఎన్నికలకు సంబంధించి పట్టణంలోని సారథి ఇంజినీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటుకు గురువారం రాత్రి ఆర్డీఓ వై.భవానీ శంకరి డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను ఉంచుతామని, ఇక్కడి నుంచి పోలింగ్‌కు సంబంధించిన మెటీరియల్‌ను నియోజకవర్గంలోని 286 పోలింగ్ స్టేషన్‌లకు పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ నేపథ్యంలో స్ట్రాంగ్ రూమ్ వైపు ఎవరూ వెళ్లకుండా ఉండేలా 24 గంటలూ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆర్డీఓ సూచించారు. కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని, కళాశాల యాజమాన్యం కూడా ఎన్నికల సమయంలో సహకరించాలని ప్రిన్సిపాల్ సూరానేని శ్రీధర్‌ను కోరారు. గత మూడు సార్లుగా సాధారణ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలకు ఇక్కడే స్ట్రాంగ్ రూమ్‌ను ఏర్పాటు చేసిన నేపథ్యంలో వసతులు అన్నీ ఉన్నందున మరలా ఇక్కడే ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.విశ్వనాథశాస్త్రి, టౌన్ సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి, వీఆర్వోలు రాజబాబు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

95 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

విస్సన్నపేట: మండలంలోని నరసాపురం గ్రామంలో గురువారం తెల్లవారుఝామున రెండు ఆటోలలో వచ్చిన 190 బస్తాలు (95 క్వింటాళ్లు) రేషన్ బియ్యాన్ని అక్రమంగా లారీలోకి లోడు చేస్తుండగా పట్టుకున్నట్లు సివిల్ సప్లయిస్ డీటీ శివనాగరాజు తెలిపారు. లోడు చేస్తున్న మాదిరాజు కృష్ణశివ దీపు, నక్కా నాగవెంకటేశ్వరరావు, ఇంజుముడి రవి, లాగు బాలమురళిపై 6ఏ కేసు, క్రిమినల్ కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశామన్నారు. తనిఖీలో ఎన్టీఆర్ జిల్లా డీఎస్ఓ జి. మోహన్‌బాబు, ఏఎస్ఓ ధనుంజయరెడ్డి, సివిల్ సప్లయిస్ డీటీ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు వెల్లటూరు జట్టు

జి.కొండూరు: ఆడుదాం ఆంధ్రా రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొనేందుకు వెల్లటూరు జట్టు సభ్యులు బుధవారం రాత్రి విశాఖపట్నం బయలుదేరి వెళ్లారు. శుక్రవారం నుంచి ఈనెల 13వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతాయి. ఎన్టీఆర్ జిల్లా తరఫున రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆడనున్న వెల్లటూరు జట్టుకు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

నేడు ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

ఇబ్రహీంపట్నం: మండల పరిధిలోని గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక ప్రజా వేదిక కార్యక్రమం వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో శుక్రవారం నిర్వహిస్తామని ఎంపీడీఓ ఉమాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది జనవరి నుంచి ఈ ఏడాది జనవరి చివరి వరకు జరిగిన పనులపై ఇప్పటికే సామాజిక తనిఖీ జరిగిందన్నారు. వాటిలో గుర్తించిన కొన్ని అంశాలపై ప్రజావేదిక ఏర్పాటు చేశామని చెప్పారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని ఆమె కోరారు.

ప్రత్యేక హోదా ఉద్యమకారులపై కేసు కొట్టివేత

తిరువూరు: రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో తిరువూరులో 2016లో జరిగిన ధర్నాలో పాల్గొన్న ఉద్యమకారులపై పోలీసులు పెట్టిన కేసును కొట్టివేస్తూ విజయవాడ ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు గురువారం తీర్పు చెప్పింది. తిరువూరు బైపాస్‌రోడ్డులో జరిగిన ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే కె. రక్షణనిధితో సహా 15 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు మొదట తిరువూరు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో విచారణ జరగగా, తదుపరి విజయవాడ ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టుకు బదిలీ అయింది. విచారణ సమయంలో వైఎస్సార్ సీపీ నాయకుడు రామవరపు లక్ష్మణరావు (బుజ్జి) మృతిచెందగా, ఎమ్మెల్యే రక్షణనిధితో పాటు మిగిలిన ఉద్యమకారులపై నమోదైన కేసును కొట్టివేశారని న్యాయవాదులు తెలిపారు.

నేడు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

గంపలగూడెం: తోటమూల వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ 24వ వార్షికోత్సవం శుక్రవారం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారికి అభిషేకాలు, ఉదయం 10 గంటలకు దివ్య కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

కొండపల్లిలో వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశం కొండపల్లిలో గురువారం రాత్రి కోలాహలంగా జరిగింది. మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు యాదవ్‌కు జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మిక్కిలి శరభయ్య, వార్డు కౌన్సిలర్లు జోగి రాము, గుంజా శ్రీనివాస్, ఎం.చంద్రశేఖర్, దయా తదితరులు ఆత్మీయ స్వాగతం పలికారు. నాయకులు, కార్యకర్తలకు పరిచయం చేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. వార్డు కౌన్సిలర్లు, జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు నల్లమోతు ప్రసన్న బోసు, ఎంఏ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలి



గంపలగూడెం: రానున్న జనరల్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని పలువురు కాపు సంఘం నేతలు అన్నారు. గంపలగూడెం మండలం వినగడపలో గురువారం వైఎస్సార్ సీపీ కాపు సంఘం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. పలువురు మాట్లాడుతూ కాపుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పారు. ఎంపీ, ఎమ్మెల్యే సీటును గెలిపించి జగనన్నకు కానుకగా ఇవ్వాలన్నారు. కాపు సంఘం మండల ప్రతినిధులుగా ఊటుకూరుకు చెందిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడు ఆలపాటి ఉమామహేశ్వరరావు, వినగడపకు చెందిన గంపలగూడెం సొసైటీ అధ్యక్షులు పెమ్మిరాజు ఆంజనేయులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పోలీసు అధికారులకు వీడ్కోలు



తిరువూరు: ఎన్నికల నేపథ్యంలో తిరువూరు సర్కిల్ నుంచి బదిలీపై వెళ్ళిన పోలీసు సిబ్బందికి బుధవారం రాత్రి మండలంలోని లక్ష్మీపురం మనో గార్డెన్స్ ఆవరణలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ నబీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వివిధ పోలీసుస్టేషన్లకు బదిలీ అయిన ఎస్ఐలు, సిబ్బందిని సత్కరించి వారి సేవలను అభినందించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



ముసునూరు: ఓటర్లు ఓటు హక్కును సక్రమంగా, ప్రశాంతంగా వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేయాలని డీటీ ఎమిలీ కుమారి అన్నారు. ముసునూరులోని హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల్లోని 77, 78, 79, 80, 81, 82, 83 పోలింగ్ కేంద్రాలను గురువారం ఎంపీడీఓ పద్మావతిదేవితో కలిసి ఆమె పరిశీలించారు. ఓటర్లకు అసౌకర్యం కలుగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు, బీఎల్‌ఓలను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఐ పి.వాసు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, వీఆర్వో మస్తాన్‌రావు, కార్యదర్శి ఆరేపల్లి, బీఎల్‌ఓలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మ నిధి సేకరణ ప్రారంభం

ముసునూరు: హిందూ ధర్మ ప్రచార వ్యాప్తికి అందరూ కృషి చేయాలని సమరసత ఫౌండేషన్ ప్రాంతీయ ప్రచారక్ ఎం. సాయిరామ్ అన్నారు. చెక్కపల్లి దివాణం సెంటర్‌లోని కోదండ రామాలయం వద్ద ధర్మనిధి సేకరణ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. పరమేశ్వరరావు, మల్లవల్లి కోటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.